సాక్షి చిత్తూరు

మంగళవారం । 18 । జూలై । 2023



పోటెత్తిన భక్తజనం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. సోమవారం, అమావాస్య కావడంతో భక్తులు బారులు తీరారు. - 8లో



శాస్త్రోక్తంగా ఆస్థానం

తిరుపతిలోని గోవిందరాజస్వామి, కోదండరాముడు, లక్ష్మీనారాయణుని ఆలయాల్లో ఆణివార ఆస్థానం నిర్వహించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	27
తిరుపతి	36	28
తిరుమల	32	23
గూడూరు	36	29
నగరి	37	28

న్యూస్‌రీల్

బోయకొండ హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు చేపట్టారు. అమ్మవారికి భక్తులు కానుకల రూపంలో రూ.76,24,883 నగదు, 44 గ్రాముల బంగారం, 393 గ్రాముల వెండితోపాటు 13 నోట్ల విదేశీ కరెన్సీ సమర్పించినట్లు ఈఓ చంద్రమౌళి తెలిపారు. అలాగే రణభేరి గంగమ్మ ఆలయ హుండీ ద్వారా రూ.64,931 సమకూరినట్లు వెల్లడించారు. ఇక సేవా టికెట్లు, ప్రసాదాల విక్రయం, వసతిగృహాల అద్దె ద్వారా రూ.95,27,804 రాబడి వచ్చిందన్నారు. కేవలం 35 రోజుల వ్యవధిలో ఎన్నడూ లేని విధంగా అమ్మవారికి మొత్తం రూ.1.72 కోట్ల ఆదాయం వచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రవికిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో ఆర్టీసీ చైర్మన్



మల్లికార్జునరెడ్డికి తీర్థప్రసాదాలు అందిస్తున్న ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మను ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి సోమవారం దర్శించుకున్నారు. ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో ఆయన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ చరిత్ర, విశిష్టతను అర్చకులు వివరించారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో చిత్తూరు ఆర్‌ఎం జితేంద్రనాథ్ రెడ్డి, పుంగనూరు డీఎం సుధాకరయ్య పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ పొడిగింపు

చిత్తూరు రూరల్: జిల్లాలో రేషన్ పంపిణీని మరో రెండు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కార్డుదారులందరికీ సరుకులు అందించడమే లక్ష్యంగా గడువు పొడిగించినట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ చౌర్యంపై కేసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో అధికారులు మొత్తం 2,998 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. 509 సర్వీసుల్లో విద్యుత్ చౌర్యం చేస్తున్నట్లు గుర్తించారు. సదరు సర్వీసుదార్లపై కేసులు నమోదు చేసి రూ.11.83 లక్షల జరిమానా విధించినట్లు ఎస్‌ఈ కృష్ణారెడ్డి తెలిపారు.

వైభవంగా అమావాస్య ఉత్సవం



ఉత్సవానికి బయలుదేరుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అమావాస్య ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్టించారు. పుర వీధుల్లో ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లను భక్తులు దర్శించి పరవశించారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 86,170 మంది స్వామివారిని దర్శించుకోగా.. 31,128 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.13 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆదుకున్నాం.. ఆదరించండి

"కుప్పం నియోజకవర్గంలో గత 35 ఏళ్లుగా చంద్రబాబు చేయలేని అభివృద్ధిని నాలుగేళ్లలోనే చేశాం.. ప్రజల దాహార్తిని శాశ్వతంగా తీర్చేందుకు చర్యలు చేపట్టాం.. పురపాలక ప్రగతిని పరుగులు తీయిస్తున్నాం.. ప్రతి కుటుంబానికి మేలు చేకూరేలా పథకాలు అందిస్తున్నాం.. వెనుకబడిన వర్గాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నాం.. మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం.. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నాం.. జనం కష్టనష్టాల్లో తోడుగా ఉంటున్నాం.. ఆపద వేళ ఆదుకుంటున్నాం.. ఆశీర్వదించి ఆదరిస్తే మరింత అండగా ఉంటాం'' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి, పక్కన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు



- సీఎం వైఎస్ జగన్ పాలనలో ప్రతి కుటుంబానికీ మేలు
- రూ.కోట్ల వ్యయంతో కుప్పం అభివృద్ధి
- సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- ప్రజలను మోసం చేసేందుకే బాబు డ్రామాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం(శాంతిపురం) : మేలు చేసిన నాయకుడిని, ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని అటవీ, విద్యుత్, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కుప్పం పట్టణంలో నిర్వహించిన వార్డు బాటలో డిప్యూటీ సీఎం నారాయణస్వామితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సభల్లో ఆయన ప్రసంగించారు. మంత్రి మాట్లాడుతూ కుప్పం పురపాలక పరిధిలో అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక గ్రాంటుగా రూ.60 కోట్లు మంజూరు చేశారన్నారు. అలాగే తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.16కోట్లు విడుదల చేశారని తెలిపారు. ప్రస్తుతం ఆయా పనులు శరవేగంగా సాగుతున్నాయని వెల్లడించారు. డీకే పల్లె, వీరప్పనాయుని చెరువులను సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుగా తీర్చిదిద్ది కుప్పం వాసులకు శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయనున్నట్లు వివరించారు. చంద్రబాబు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసినా సొంత నియోజకవర్గాన్ని రెవెన్యూ డివిజన్‌గా మార్చుకోలేకపోయారని, ఒక్క లేఖతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కలను సాకారం చేశారని తెలిపారు. అలాగే పోలీస్ డివిజన్ కూడా ఏర్పాటు చేశారన్నారు. 35 ఏళ్లుగా చంద్రబాబు ఏం మేలు చేశారో ప్రజలు ఆలోచించుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాల్లో ఒకటో వంతు కూడా చంద్రబాబు ఇవ్వలేదని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో కేవలం ఓట్ల కోసం ట్రాక్టర్‌కు డేరా కట్టి అన్న కాంటిన్ అంటూ నాటకాలు ఆడారని విమర్శించారు. అదే రాజన్న క్యాంటిన్ ద్వారా ఉదయం, మధ్యాహ్నం పేదలకు నాణ్యమైన భోజనాన్ని ఉచితంగా అందిస్తున్నామని వెల్లడించారు. పేదలకు ఎవరు మేలు చేసినా తాము సహకరిస్తామని, చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ మాత్రం జనహితం మరిచి ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. కుప్పంలో టీడీపీ కనుమరుగైందని, అందుకే ప్రకాశం జిల్లా నుంచి తన బంధువు శ్రీకాంత్‌ను చంద్రబాబు ఇన్‌చార్జిగా తీసుకువచ్చారన్నారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారు అభిమానంతో ఓట్లు వేసినా కుప్పంలో భరత్‌కు లక్ష ఓట్లు వస్తాయని తెలిపారు. వైఎస్సార్ సీపీని గెలిపిస్తే తామంతా సేవకుల్లా, సైనికుల్లా ప్రజల కోసం పని చేస్తామన్నారు. 2014లో రైతులు, డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చంద్రబాబు పూర్తిగా ఏమార్చారని విమర్శించారు. అయితే ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో మాఫీ చేశారని వెల్లడించారు.

కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా 2,300 పైచిలుకు వ్యాధులకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నామన్నారు. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని వెల్లడించారు. చంద్రబాబు కుప్పంలో ఓడిపోవడం ఖాయమన్నారు. బాబుకు ఓటు వేస్తే కుప్పంలో మళ్లీ ఆయన అనుచరుల అరాచక రాజ్యమే కొనసాగుతుందని హెచ్చరించారు. బాబు హయాంలో టీడీపీ స్థానిక నాయకుల కబంధ హస్తాల్లో ప్రజలు నానా అవస్థలు పడ్డారని గుర్తుచేశారు. భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే కేబినెట్‌లోకి తీసుకుని, ఈ ప్రాంత అభివృద్ధికి మరింత సహకరిస్తారని వివరించారు. కరోనా వేళ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటే చంద్రబాబు ఆయన కొడుకు హైదరాబాదులో దాక్కున్నారని, భరత్, వలంటీర్లు స్థానిక నాయకులు ధైర్యంగా సేవలందించారని వెల్లడించారు.



వార్డు బాట సభకు హాజరైన ప్రజలు

బలహీన వర్గాల శత్రువు బాబు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను చంద్రబాబు శత్రువులా చూస్తారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లిలోని దళిత కాలనీలో టీడీపీవారు కనీసం ఓటు కూడా అడగరని ఆరోపించారు. దళితులను ఓటు వేయడానికి రానివ్వకుండా రిగ్గింగులకు పాల్పడిన చరిత్ర వారిదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే దళితులకు లబ్ధి చేకూరుతోందని వెల్లడించారు. అంబేడ్కర్, పూలే ఆశయాల సాధనే లక్ష్యంగా జగనన్న పనిచేస్తున్నారని చెప్పారు. అగ్రవర్ణాల పిల్లలతో సమానంగా దళిత బిడ్డలకు కూడా నాణ్యమైన మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, ఇతర సదుపాయాలు అందిస్తున్నారని వివరించారు. బీసీ నేతలు ఆర్.కృష్ణయ్య, మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావును రాజ్యసభకు పంపిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, మున్సిపల్ చైర్మన్ సుధీర్, రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్లు మునస్వామి, హఫీజ్, ఎంపీపీ అశ్వని, జెడ్పీటీసీ సభ్యుడు ఏడీఎస్ శరవణ, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు నందకుమార్, శ్రీనివాసమూర్తి, పెద్దన్న, వైఎస్సార్‌సీపీ నేతలు నరేష్‌కుమార్ రెడ్డి, మొగసాల రెడ్డెప్ప, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పేదలకు తక్కువ ధరకే 'ఆహా'రం

నగరి : తక్కువ ధరకే నాణ్యతతో కూడిన రుచికరమైన ఆహారం అందించేందుకు ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను మంత్రి ఆర్‌కే రోజా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్‌లో ఆహారం కొనుగోలు చేశారు.

అలాగే మెప్మా ఏర్పాటు చేసిన ఫుడ్‌మేళాను ప్రారంభించి వంటకాలను రుచి చూశారు. ఫుడ్ చాలా బావుంది అంటూ మహిళలను ప్రశంసించారు. మంత్రి మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం పల్లెల నుంచి పట్టణాలకు వచ్చేవారి తక్కువ ధరకే భోజనం అందించేందుకు ప్రభుత్వం ఆహా క్యాంటీన్‌లు ఏర్పాటు చేస్తోందన్నారు. పట్టణాల్లో స్వయం సహాయక సంఘాలు వీటిని నిర్వహిస్తాయని తెలిపారు. శాశ్వత ప్రాతిపదిక భవనాలు నిర్మించాలన్నా, అద్దెలు చెల్లించాలన్నా కష్ట పడాల్సి వస్తుంది గనుక రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, ఆస్పత్రుల ఆవరణల్లో తాత్కాలికంగా టెంట్లు వేసి స్టాళ్లు ఏర్పాటు చేసి ఆహారం విక్రయిస్తారని వివరించారు. ఈ స్టాల్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన సంఘ సభ్యులకు ప్రతి నెలా రూ.500 చొప్పున టౌన్ లెవల్ ఫెడరేషన్‌కు జమ చేసే సదుపాయంతో రూ.13 వేలు చొప్పున ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 110 ప్రాంతాల్లో 140 యూనిట్లు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. త్వరలో నగరి పట్టణంలో అర్బన్ మహిళా మార్ట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ సుజన, మెప్మా పీడీ రాధమ్మ, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, వెటర్నరీ ఏడీ వాసు, మెప్మా డీపీఎంయూలు బాబు, జయరాం, టీఎల్‌ఎం సునీత, మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, వెంకటరత్నంరెడ్డి పాల్గొన్నారు.



నగరిలో ఆహా క్యాంటిన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

పకడ్బందీగా 'సురక్ష' క్యాంపులు

చిత్తూరు కలెక్టరేట్ : జగనన్న సురక్ష క్యాంపులను పకడ్బందీగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జగనన్న సురక్ష క్యాంపులను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. క్యాంపులపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. జగనన్నకు చెబుదాం, స్పందనలో వచ్చిన అర్జీలు రీఓపెన్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. రీఓపెన్ అయిన అర్జీలను 24 నుంచి 48 గంటలలోపు అర్జీదారులతో మాట్లాడి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సూచించారు. మండలాల వారీగా 100శాతం ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. బదిలీ అయిన వీఆర్‌ఓలు వెంటనే కొత్త మండలాల్లో జాయిన్ కావాలని స్పష్టం చేశారు. జాయిన్ కానివారి జాబితాను మంగళవారం మధ్యాహ్నంలోపు పంపాలని తహసీల్దార్లను ఆదేశించారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, డిజిటల్ లైబ్రరీ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో సీపీఓ ఉమాదేవి, వివిధ శాఖల ఈఈలు ఉమామహేశ్వర్ రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, శంకర్ బాబు, హౌసింగ్, డ్వామా పీడీలు పద్మనాభం, గంగాభవానీ పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

రీ సర్వే వేగవంతం

జిల్లా వ్యాప్తంగా భూముల రీ సర్వే పనులు వేగవంతం చేయాలని జేసీ ఆదేశించారు. అసైన్‌మెంట్ భూములను గుర్తించి పట్టాలు సిద్ధం చేయాలని సూచించారు. సివిల్ సప్లైస్, మార్కెటింగ్ శాఖల అధికారులు సమన్వయంతో బియ్యం విక్రయ కేంద్రాలను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ రాజశేఖర్, డీఎస్‌ఓ శంకరన్ పాల్గొన్నారు.

పుష్ప పల్లకీపై పురుషోత్తముడు



వేడుకగా నిర్వహిస్తున్న పుష్పపల్లకీ సేవను వీక్షిస్తున్న అశేష భక్తజనం

తిరుమల శ్రీవారి ఆలయంలో సాలకట్ల ఆణివార ఆస్థానాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సర్వభూపాల వాహనంలో ఉభయ దేవేరులతో కలిసి మలయప్పస్వామివారు గరుత్మంతుడికి అభిముఖంగా.. మరో పీఠంపై స్వామివారి స్వరసైనాధ్యక్షుడైన శ్రీవిశ్వక్సేనులవారు దక్షిణాభిముకంగా వేంచేపు చేశారు. అనంతరం హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసి ఆణివార ఆస్థానాన్ని ముగించారు. సాయంత్రం పుష్పపల్లకీ సేవ వైభవంగా సాగింది. వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన పల్లకీపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. సుమారు టన్ను పుష్పాలతో పుష్పపల్లకీని అలంకరించారు. టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు మూరంశెట్టి రాములు, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, ఎస్‌ఈ–2 జగదీశ్వర్‌రెడ్డి, పేష్కార్ శ్రీహరి, ఉద్యానవన విభాగం డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, విజిఓ బాలిరెడ్డి పాల్గొన్నారు.



ఉభయ దేవేరీ సమేత మలయప్పకు హారతి సమర్పిస్తున్న అర్చకుడు

శ్రీవారి ఆలయంపై విమానం



ఆలయంపై వెళుతున్న విమానం

తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయం పైనుంచి విమానం వెళ్లిన ఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. విమానం రేణిగుంట విమానాశ్రయం నుంచి వచ్చిందా.. లేక ఇతర ప్రాంతాల నుంచి వచ్చిందో తెలియలేదు. ఆగమశాస్త్రం ప్రకారం తిరుమల ఆలయంపై విమానాలు వెళ్లరాదు. దీనిపై భద్రతాధికారులు పరిశీలిస్తున్నారు.

విద్యారంగం అభివృద్ధికి ప్రాధాన్యం

చిత్తూరు కలెక్టరేట్ : విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. సోమవారం చిత్తూరులోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో జిల్లాలోని పలువురు టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి మ్యాజిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీవన నైపుణ్యాలను నేర్పించేందుకే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఎంపిక చేసిన 50 ఉన్నత పాఠశాలల నుంచి పీడీలు, ఉపాధ్యాయులు మొత్తం 100 మందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణను టీచర్లు వినియోగించుకోవాలని సూచించారు. గైర్హాజరైతే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, డైట్ అధ్యాపకులు బి. చెంగల్రాజు, ప్రభాకర్, శ్రీనివాసులు రెడ్డి, రెడ్డి వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ విజయేంద్రరావు

డ్రిప్ పరికరాల పరిశీలన



జంబువారిపల్లెలో డ్రిప్ పరికరాలను పరిశీలిస్తున్న అధికారులు

బంగారుపాళెం : మండలంలోని జంబువారిపల్లెలో సుధాకర్ అనే రైతు పొలంలో ఏర్పాటు చేసిన డ్రిప్ పరికరాలను సోమవారం ఏపీఎంఐపీ గుంటూరు ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. పరికరాల్లో నాణ్యత లోపించినా, సాంకేతిక లోపాలు తలెత్తినా కంపెనీ యాజమాన్యమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందించిన డ్రిప్ పరికరాలను రైతులు అమర్చుకోకుంటే వెనక్కు తీసుకుంటామని హెచ్చరించారు. పీడీ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు

–టీడీపీ నాయకులపై చర్యలకు ఆదేశం



విలేకర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ గుర్రప్ప

గుడుపల్లె: సోషల్ మీడియాలో టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలతో పోస్టులు పెడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ గుర్రప్ప హెచ్చరించారు. సోమవారం తన కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఈ నెల 14తమ కార్యాలయంలో వీఆర్ఏ గోవిందప్ప ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారని, ఆయన ఒక రైతు అని, భూమి ఉందని, ఆ భూమిని వైఎస్సార్ సీపీ నాయకులు లాక్కున్నారని, దీనికి రెవెన్యూ అధికారులు సహకరించాలని టీడీపీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టు పెట్టారని మండిపడ్డారు. ఏ గోవిందప్పకు భూమి లేదని, అతను రైతు కాదని, వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని, అయితే దీనిని వక్రీకరిస్తూ ఉద్దేశపూర్వకంగా తప్పుడు పోస్టు పెట్టిన వారిపై టీటీడీ నాయకులపై విచారణ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గుడుపల్లె ఎస్ఐ లక్ష్మీకాంత్‌ను కోరారు.

సత్వర పరిష్కారానికే 'స్పందన'



వినతులు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు



అర్జీదారులతో మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో చేపట్టిన స్పందనలో ఆయన వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను స్వీకరించారు. వినతులకు అన్ని శాఖల అధికారులు అధిక ప్రాధాన్యమిచ్చి పరిష్కరించాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనలో మొత్తం 308 అర్జీలు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 28 వినతులు

చిత్తూరు అర్బన్ : నగరంలోని ఆర్ముడు రిజర్వు పోలీసు కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించారు. ఏఎస్పీలు సుధాకర్, శ్రీలక్ష్మి అర్జీలను స్వీకరించారు. ప్రజలు అందించే వినతులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. మొత్తం 28 అర్జీలు వచ్చినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,460
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,000
రిటైల్ వెండి గ్రాము	రూ.79.00

ఆటో ఢీకొని ముగ్గురికి గాయాలు

సోమల : మండలంలోని మేటిమంద మార్గంలో నేటి ఆంజనేయస్వామి గుడి వద్ద బైక్‌ను ఆటో ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. సదుం మండలం నాయనపాకాలకు చెందిన రెడ్డెప్ప, ఎర్రనాగులవారిపల్లెకు చెందిన మునిరత్నం, పిల్లలు తేజేష్, సాత్విక్‌తో కలిసి బైక్‌పై వెళుతుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రులు రెడ్డెప్ప, మునిరత్నం, తేజేష్‌ను స్థానికులు సోమల పీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పెద్దపంజాణి : మండలంలోని పలమనేరు–శంకర్రాయలపేట రోడ్డు శివాడి చెరువు వద్ద గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ టి.శ్రీనివాసులు తెలిపారు. నిందితుడు శివాడికి చెందిన గుండ్లపల్లె వినయ్ అలియాస్ విక్కీ నుంచి 2.2కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. తహసీల్దార్ లోకేశ్వరరావు ఎదుట నిందితుడిని హాజరు పరిచి, ఆయన ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య

పుంగనూరు : పట్టణ సమీపంలో సోమవారం ఓ ఆటో డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మోహన్‌కుమార్ కథనం మేరకు.. రాజేంద్ర (35) అనే వ్యక్తి ఆటోలో రేషన్‌షాపులకు సరుకు రవాణా చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్య కారణాలతో రాజేంద్ర సోమవారం సాయంత్రం వరకు ఇంట్లోనే ఉన్నాడు. తర్వాత బయటకు వెళ్లి తోపుమఠానికి వెళ్లే రహదారిలో చింతచెట్టుకు ఉరివేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి , మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: మండలంలో సోమవారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించి వరదరాజులపల్లె మిట్టిండ్లులో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న మురగయ్య (45) అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. 17 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. దాడిలో సీఐ జోగేంద్ర, ఎస్ఐ బాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన వెంకటేష్

సదుం : మండలంలోని బూరగమంద క్రాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. చంద్రగిరికి చెందిన వెంకటేష్, తన భార్య మానికతో కలిసి ద్విచక్రవాహనంపై ఎస్ఎం పల్లెకు వెళుతుండగా అదుపు తప్పి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన వెంటేష్‌ను 108లో సీహెచ్‌సీకి తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

చిరుత దాడిలో లేగదూడల మృతి



లేగదూడ కళేబరం

బైరెడ్డిపల్లె : మండలంలోని గౌనితిమ్మేపల్లెలో చిరుతపులి సంచారంపై కలకలం రేగింది. గ్రామానికి చెందిన ఇమామ్‌సాబ్, లక్ష్మప్ప అనే రైతులకు చెందిన పశువుల షెడ్డులో లేగదూడలపై చిరుత దాడి చేసింది. దీంతో రెండు దూడలు మృతి చెందాయి. దీనిపై సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు వెంటనే గ్రామానికి చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. తగు చర్యలు తీసుకుంటామని, బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు

వ్యక్తి ఆత్మహత్య

చౌడేపల్లె : మండలంలోని కాగతి పంచాయతీ యల్లంపల్లె వద్ద సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు.. దిగువపల్లె పంచాయతీ యానాదిపాళ్యానికి చెందిన పాపన్న(40) యల్లంపల్లెలో ఓ రైతుకు చెందిన మామిడితోటకు కాపలాదారుగా ఉంటున్నాడు. రెండు నెలలుగా కుటుంబకలహాల కారణంగా భార్య వేరుగా ఉంటోంది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన పాపన్న మామిడితోటలోని బావిలో పంచెతో ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య గంగులమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవికుమార్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



గాయపడిన కన్నియప్పన్

చిత్తూరు అర్బన్: నగరంలోని కట్టెలదొడ్డికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కన్నయ్యప్పన్‌పై టీడీపీకి చెందిన రౌడీషీటర్ దాడికి పాల్పడ్డాడు. బాధితుడు స్థానికంగా దుకాణం నిర్వహించుకుంటున్నాడు. ఆదివారం అదే ప్రాంతానికి చెందిన గురు అనే యువకుడిని శరవణ, విక్కీ ఇద్దరు కలిసి కొడుతుండగా కన్నయ్యప్పన్ విడిపించడానికి ప్రయత్నించాడు. శరవణ, విక్కీ ఆగ్రహంతో కన్నియప్పన్‌ను చావబాదారు. తీవ్రంగా గాయపడిన కన్నియప్పన్‌ను స్థానికులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మద్దయ్య ఆచారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు శరవణపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయి. టీడీపీలో క్రియాశీలకంగా ఉండే శరవణపై రౌడీషీట్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి



పరశురామ్ మృతదేహం

పుత్తూరు రూరల్: రూరల్ మండలం కేబీఆర్‌పురం దళితవాడకు చెందిన పరశురామ్(55) అనే వ్యక్తి సోమవారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. పరశురామ్ ఇంట్లో రిఫ్రిజిరేటర్ సిలిండర్ పేలడంతో పరశురామ్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందగా, అతడి కుమార్తె మంజుల(10)కి స్వల్ప గాయాలయ్యాయని బంధువులు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు. మృతదేహానికి పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని వెల్లడించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంజాయి పట్టివేత : ఇద్దరి అరెస్ట్



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పుంగనూరు : పట్టణంలోని యూఎస్ఆర్ సర్కిల్ నుంచి పలమనేరు వెళ్లే రోడ్డులో గంజాయి తరలిస్తున్న ఇద్దరిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నిందితులు స్థానిక భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఆవుల ప్రభాకర్, తమిళనాడుకు చెందిన ఎస్ఆర్ కృష్ణగా గుర్తించామన్నారు. ఇద్దరినీ కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. దాడిలో ఎస్ఐ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి, కోదండరామస్వామి, లక్ష్మీనారాయణ స్వామి ఆలయాల్లో సోమవారం సాయంత్రం ఆణివార ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో దీనికి ఆణివార ఆస్థానం అని పేరు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు ఆణివార ఆస్థానం. నాటి నుంచి టీటీడీ ఆదాయ వ్యయాలు, నిల్వలు, వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవి. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తర్వాత వార్షిక బడ్జెట్‌ను మార్చి, ఏప్రిల్ నెలలకు మార్చారు. ఆణివార ఆస్థానంలో భాగంగా గోవిందరాజస్వామి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామి వారిని వేంచేపు చేసి సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 గంటల వరకు ఆస్థానం నిర్వహించారు. అలాగే కోదండరామస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం గరుడాళ్వార్ ఎదురుగా సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ఆస్థానం నిర్వహించారు. అనంతరం స్వామివారు హనుమంత వాహనంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించారు. అలాగే అలిపిరి పాదాల మండపం వద్దనున్న లక్ష్మీనారాయణస్వామి ఆలయంలోనూ ఆణివార ఆస్థానం నిర్వహించారు.

ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ సందర్శన



తాళపత్ర గ్రంథాల విశేషాలను వివరిస్తున్న ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్: పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు విభాగపు ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థినులు సోమవారం ఎస్వీయూలోని ప్రాచ్య పరిశోధనా సంస్థను సందర్శించారు. తాళపత్ర గ్రంథాల రక్షణ, పరిష్కరణలో చేపట్టిన, చేపడుతున్న చర్యలను డాక్టర్ రాజశేఖర్ విద్యార్థినులకు వివరించారు. లిపి పూర్వోత్తరాలు, లిపిలో జరిగిన మార్పులు, తాళపత్రాలను ఏ విధంగా తయారుచేసేవారు, వాటిపై రాసే పద్ధతులు, భద్రపరిచే తీరుపై అవగాహన కల్పించారు. ప్రాచీన తాళపత్ర గ్రంథాలు పరిశోధకులకు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పీసీ.వెంకటేశ్వర్లు, మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ అధ్యక్షులు కొలకలూరి మధుజ్యోతి, వై.సుభాషిణి, డి.యువశ్రీ, బి.లక్ష్మీప్రియ పాల్గొన్నారు.

ముక్కంటి దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ఆలయం వద్ద వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ముక్కంటి దర్శనానికి సోమవారం భక్తులు పోటెత్తారు. అమావాస్య కావడంతో ఉదయం నుంచే భక్తులు బారులు తీరారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శన ఏర్పాట్లు చేశారు. సుమారు 35 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 3,310 మంది భక్తులు, రూ.50 ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా 1,890 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.500 రాహుకేతు టికెట్ల ద్వారా 4,344, రూ.750 టికెట్ల ద్వారా 1,877మంది, రూ.1,500 టికెట్ల ద్వారా 615మంది, రూ.2,500 టికెట్ల ద్వారా 416, రూ.5వేల టికెట్ల ద్వారా 106మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు 31,500 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.